క్లుప్తంగా

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు



నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం నల్లకుంట చెరువులో గణేష్ నిమజ్జనానికి మున్సిపల్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. వినాయక విగ్రహాల ట్రాక్టర్లు చెరువు వద్దకు వెళ్లేందుకు అధికారులు కంకరతో రహదారిని ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరిగేలా తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ చింతల వేణు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది పంచాయతీ కార్యదర్శులను బుధవారం జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ సెక్రటరీలను తల్లాడ, రఘునాధపాలెం, వైరా, పెనుబల్లి, సింగరేణి, ఖమ్మం రూరల్, వేంసూర్, సత్తుపల్లి మండలాలకు బదిలీ అయ్యారు. బదిలీ సమాచారాన్ని ఎంపీడీవో సురేందర్ ధృవీకరించారు. ఎర్రుపాలెం మండలానికి కూడా బదిలీ కార్యదర్శుల స్థానంలో వేరే వారికి పోస్టింగ్ వేశారని తెలిపారు.

కొలువు సాధించిన మర్లపాడు యువకుడు

వేంసూరు: మండలంలోని మర్లపాడు కురంగు డెంకి చెందిన బర్ల కేశవరావు సోమవారం విడుదలైన టీజీపీ ఎస్సీ పాలిటెక్నిక్ లైబ్రేరియన్ ఫలితాల్లో కొలువు సాధించాడు. ప్రస్తుతం బీసీ గురుకుల అశ్వారావుపేట నందు లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులను అందిస్తున్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆపార్టీ మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పలు గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.7.38 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో లబ్ధిదారులకు చెక్కులను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, నాయకులు నర్సింహారావు, వెంకట కృష్ణారావు, జానీ బాషా, శ్రీనివాసరావు, రాజీవ్‌గాంధీ, వేమిరెడ్డి అనురాధ, ఇస్మాయిల్, వెంకట నర్సయ్య, బాబురావు, వెంకటనారాయణ, రామారావు, ముత్యాల రావు సరోజిని తదితరులున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

మధిర: భారీ వర్షాలకు పంట నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నాగవరప్పాడు గ్రామానికి చెందిన మోరుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సొంత పొలాలు లేకపోయినప్పటికీ ఎంతో మంది కౌలు రైతులు పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారని, ఒక్కసారిగా కురిసిన వర్షాలకు పంటలను నష్టపోవడం జరిగిందన్నారు. తనకు సొంత భూమి లేనప్పటికీ మూడు ఎకరాలు తీసుకొని సాగు చేయడం జరిగిందని తెలిపాడు. భారీ వర్షాలకు సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, లేనిపక్షంలో తమలాంటి వారికి ఆత్మహత్యలే శరణ్యమని వాపోయాడు.

కలెక్టర్‌కు వినతి

కొణిజర్ల: గుంతలతో అధ్వానంగా తయారైన లింగగూడెం-పెద్దమునగాల ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతూ.. టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ విభాగం కన్వీనర్ దర్జీ చెన్నారావు బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. దీంతో కలెక్టర్ స్పందించి.. దీనిపై తక్షణమే అంచనాలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని నాగులవంచకి చెందిన షేక్ నాగుల్‌మీరా, సోందు సాహెబ్, హుస్సేన్ బీ అను ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ బాషా సాహెబ్ ఇంటి స్థలంలోకి షేక్ నాగుల్‌మీరా ప్రవేశించి మెట్లను నిర్మిస్తున్నాడు. ఇదేమిటని ప్రశ్నించిన బాషా సాహెబ్‌ను నాగుల్‌మీరా, అతని తల్లి హుస్సేన్ బీ, బాబాయి సోందు సాహెబ్ ముగ్గురు కలిసి తిట్టి చేతులతో కొట్టి చంపుతామని బెదిరించారు. బాషా సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

గణపతికి పూజలు.. అన్నదానాలు



సత్తుపల్లిటౌన్: మహాగణపతికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

మధిర: మధిర టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాధుడిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం చేశారు.

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రేచర్ల బజార్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని జైపాల్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మిట్టపల్లి నాగి, దార్నా రాజశేఖర్ పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని రాజ్యాతండా సీతారామ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైరా నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గాలిబ్ పాషా ప్రారంభించారు. అంతకు ముందు గణేష్ మండపంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుల పుల్లయ్య, అయ్యప్ప ట్రస్టు చైర్మన్ మూడ్ సిద్దు, సురేష్, నాగ సైదులు, రామ్మూర్తి, గోపి, శ్రీను, సాయి సతీష్, రాములు, వెంకటేశ్వర్లు, కృష్ణ, లాలు పాల్గొన్నారు.



మధిర టీచర్స్ కాలనీలో..

ఏన్కూరు: మండలంలోని రామాలయం, చెరువు కట్టబజార్ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. ఎస్సై బాదావత్ రవి ప్రారంభించారు. అదే విధంగా తూతకలింగన్నపేటలో చిన్నారుల ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జన వేడుకలు నిర్వహించారు.

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని హనుమాన్‌నగర్, ద్వారకాపురి కాలనీ, బైపాస్‌రోడ్‌లోని మహా గణపతి మందిరాలలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ నిర్వాహకులు, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



వైరాలో భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్

పెనుబల్లి: మండలంలోని ఎరుగట్ల, రామచంద్రపురం, లంకాసాగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసి గణపతి విగ్రహాలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాలను ప్రారంభించారు.

తల్లాడ: మండలంలోని మల్లవరం పంచాయతీ గంగదేవిపాడు, పినపాక పంచాయతీ వెంకటాపురం గ్రామాల్లో బుధవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గంగదేవిపాడులో అన్నదానం కార్యక్రమాన్ని సొసైటీ ఉపాధ్యక్షులు రేగళ్ల సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు చోట్ల గణపతి నిమజ్జనం ఘనంగా జరిగింది.



తల్లాడ: గంగదేవిపాడు గ్రామంలో..



కొణిజర్ల: రాజ్యాతండాలో పూజలు చేస్తున్న కోసూరి శ్రీనివాసరావు, తదితరులు



ఏన్కూరు: తూతకలింగన్నపేటలో వినాయకుడికి నిమజ్జనం చేస్తున్న దృశ్యం

రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలి



కల్లూరు: మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్

కల్లూరు/ఎర్రుపాలెం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ, రైతు భరోసా పథకాల అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరులోని సీపీఎం కార్యాలయంలో గంపల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో మాదినేని రమేష్ పాల్గొనగా.. ఎర్రుపాలెం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వీరయ్య పాల్గొని సీపీఎం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారని, పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయడానికి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వరదల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ నెల నుంచి సీపీఎం పార్టీ గ్రామ సభలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణార్జునరావు, కమిటీ సభ్యులు, ఎర్రుపాలెంలో నాయకులు కిశోర్, నాగులవంచ వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, రాజు, మధురాజు, వీర వెంకయ్య, వేణు, సంగయ్య, కృష్ణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

సత్తుపల్లిటౌన్: విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని సత్తుపల్లి రేంజర్ పి.స్నేహలత అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం సంవత్సరం బుధవారం సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ కార్యాలయంలో అమరులైన అటవీ ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎంఆర్ పిచ్చేశ్వరరావు, ఎఫ్ఎస్ఓలు నర్సింహా, వేణుమాధవ్, రమేష్, అరుణ్‌కుమార్, నాగరాజు, భాస్కర్, సిబ్బంది సుధాకర్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలో బుధవారం అటవీ అమరవీరుల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఫారెస్ట్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై తల్లాడ పుర వీధుల్లో కొనసాగింది. కార్యక్రమంలో తల్లాడ అటవీ రేంజ్ అధికారి ఉమ, డీఆర్ఓలు శ్రీను, రాంసింగ్, సురేష్, కాలు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: అమరులైన ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న రేంజర్ స్నేహలత, ఉద్యోగులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఖోఖో బాలుర జిల్లా జట్టు



బాలికల జిల్లా జట్టు

కల్లూరు: జిల్లా ఖోఖో అసోసియేషన్ మరియు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖోఖో పోటీలు బుధవారం నిర్వహించారు. కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 415 మంది క్రీడాకారులు, 50 మంది వ్యాయామ దర్శకులు, వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. పోటీల్లో 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 13,14,15 తేదీల్లో హైదరాబాద్ మౌలాలీలో జరుగు 34వ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనున్నారు. అనంతరం అందరికీ భోజన సదుపాయం కల్పించారు. పీఎస్ఆర్ నిర్వాహకులు పొంగులేటి మాధురి హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, ఎంపికల నిర్వాహణ కన్వీనర్ నివేధిత, ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరరాఘవయ్య, సంయుక్త కార్యదర్శి నరసయ్య, మహిళా విభాగ ఇన్‌చార్జ్ రమాదేవి, ఏజెన్సీ ఏరియా ఇన్‌చార్జ్ రామారావు, ఎస్ ప్రసాద్, కృష్ణ, పవన్‌కుమార్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రాధాకృష్ణ, భీమా, దుర్గారెడ్డి, ఎన్ఐఎస్ కోచ్ శ్రీనివాస్, కృష్ణయ్య, శ్రీదేవి, మౌలాలి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు నిధులు మంజూరు

మధిర: మండలంలోని సిరిపురం నుంచి మల్లవరం మీదుగా నెమలి వరకు రోడ్డు వెడల్పునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.26 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈ నెల 10న రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

బోనకల్: మండలంలోని రావినూతల నుంచి ప్రొద్దుటూరు వెళ్లే రోడ్డుకు మోక్షం లభించింది. లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, గోవిందాపురంలో ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు కావడంతో కనెక్టివిటి రహదారి సింగిల్ రోడ్డు కావడంతో డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.26కోట్లు నిధులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేయించారు. దీంతో రావినూతల గ్రామం వరకు డబుల్ రోడ్డు ఉండడంతో అక్కడి నుంచి ప్రొద్దుటూరు వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా చేయనున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పైడిపల్లి కిషోర్, బందం నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, మాజీ జెడ్పీటీసీ సుధీర్‌బాబు, నాయకులు వెంకటేశ్వర్లు భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

యాకూబ్ అలీ మరణం పార్టీకి తీరని లోటు

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంకు చెందిన షేక్.యాకూబ్ అలీ మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని నున్నా నాగేశ్వరరావుతో పాటు జిల్లా కమిటీ సభ్యులు రమేష్, వీరభద్రం, రాంబాబు, కృష్ణ, నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణితశాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తున్న బి.వెంకటేశ్వరరావుకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. స్టడీస్ ఆఫ్ వేవ్ ప్రొపగేషన్ ప్రాబ్లమ్స్ ఇన్ ఎలాస్టిక్ సాలిడ్స్ అనే అంశంపై డాక్టర్ కె.సోమయ్య పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని ఆయన సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును కళాశాలలో బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గురుకులాల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎర్రుపాలెం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 12న ఖమ్మంలోని అంబేడ్కర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు టీజీపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట లోకేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పొట్టపింజర చిట్టిబాబులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



మిట్టపల్లిలో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: మండలంలోని ఏడు గ్రామాల్లో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మండలంలోని మల్లవరం, అన్నారుగూడెం, తల్లాడ, నారాయణపురం, మిట్టపల్లి, ముద్దునూరు, బిల్లుపాడు గ్రామాల్లో.. గర్భిణులకు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ టీకాల వల్ల పిల్లల్లో పోలియో, క్షయ, డిప్తీరియా, నిమోనియా, టెటనస్, రుబెల్లా వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రత్న మనోహర్, సూపర్‌వైజర్లు పెద్ద పుల్లయ్య, భాస్కర్, భద్రమ్మ, కమల, జాన్సీ లక్ష్మీ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ సేవలను అందించారు. అవసరమైన పిల్లలకు సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

'నా ఖమ్మం కోసం నేను'కు స్పందన

విరాళాల సేకరణ



మధిరరూరల్: విరాళాలు అందించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు



సత్తుపల్లిరూరల్: విరాళం అందజేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

బోనకల్: వరద బాధితుల కోసం 'నా ఖమ్మం కోసం నేను' అనే కార్యక్రమానికి విరాళాలు అందజేస్తున్నారు. బోనకల్ జీపీలో బుధవారం సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు 75కిలోల బియ్యం, మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ రూ.5వేలు, లైన్‌మెన్ 25కేజీల బియ్యం వరద బాధితుల సహాయార్థం పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కు అందజేశారు.

చిన్నారుల చేయూత

మధిరరూరల్: మాటూరు హైస్కూల్ చిన్నారులు వరద బాధితులకు తమ పాకెట్ మనీని అందజేశారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ఇచ్చిన రూ.10వేల విరాళాలను బుధవారం పాఠశాల హెచ్ఎం చెరుపల్లి శ్రీహరికి అందజేశారు. ఈ సందర్భంగా విద్య, క్రీడల్లోనే కాకుండా ప్రకృతి వైపరీత్యాల్లో కూడా తమ వంతు కృషి చేస్తున్న విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

కారేపల్లి: కారేపల్లి మండల పరిషత్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కారేపల్లిలోని దుకాణాల్లో బుధవారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తిలక్‌కిషోర్, జీపీ వర్కర్లు కొమరయ్య, తిరపయ్య, శ్రీను, యాదగిరి, పద్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో జీపీ కార్యదర్శి వేణు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. లక్ష్మీపురంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి రూ.10 వేలు విరాళం అందించారు. తల్లాడలో పాస్టర్ ఇశ్రాయేలు వంద చీరలను అందజేశారు.



కారేపల్లి: విరాళాలు సేకరిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమేష్

ఆర్టీసీ ఉద్యోగులు సైతం..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో బుధవారం విరాళాల బాక్స్‌ను ఏర్పాటు చేసి డీఎం రాజ్యలక్ష్మి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ఎస్.సాహితి, వీబీఓ కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.

సదాశివునిపేటలో..

సదాశివునిపేటలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం వరదబాధితుల కోసం సేకరించిన 4,200లను సత్తుపల్లి ఎంఈఓ వెంకటేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బుచ్చిబాబు, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, నిరంజన్, విక్రమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు, చిన్నకోరుకొండి గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, గ్రామ ముఖ్యులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను ఎంపీడీఓకు అందజేస్తున్నారు.

ఫొటో గ్రాఫర్లకు ఆర్థిక సాయం



హబీబ్‌కు నగదు, నిత్యావసర వస్తువులు అందిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ మెట్రో హబీబ్‌కి ఫొటో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు దేవర నాగరాజు, తుమ్మల యుగంధర్ చేతుల మీదగా రూ.25 వేల నగదు, రూ.3 వేల విలువైన నిత్యావసర వస్తువులు అందించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరావు, జానపాటి రోజ్‌వేణుల చొరవతో జిల్లా కమిటీకి సమాచారం అందజేశారు. దీంతో స్పందించిన జిల్లా కమిటీ బుధవారం ఖమ్మంలో జూబ్లీక్లబ్ వద్ద ఏర్పాటు చేసిన వరదబాధితులకు సహాయ కార్యక్రమంలో హబీబ్‌కు రూ.25 వేలు, కల్లూరు మండలం పేరువంచ ఫొటో గ్రాఫర్ పాషాకు రూ.35 వేలు, మండల కమిటీ రూ.5 వేలు మొత్తం రూ.40 వేలు అందజేశారు.

వరద బాధితుల సహాయార్థం లడ్డూ వేలం నగదు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జక్కంపూడి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా గణనాధుడి చేతిలోని లడ్డూను వేలం పాట నిర్వహించి రూ.7,500 నగదును వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి అందించారు. ఈ నగదును రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వంశీధర్, ఎంఎస్ఆర్ శర్మ, గరటయ్య, వేమారెడ్డి, నల్లజాల చంద్రరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీ అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావు సహకారంతో స్థానిక నాయకులు వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. బాధితులను ఆదుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గోపాలపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయుడు విద్యార్థులకు అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు సింగిరికొండ సతీష్ కుమార్తె సాయి సాహర్ష జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టై, బెల్ట్‌లు, బ్యాడ్జీలు..

కల్లూరురూరల్: కల్లూరులోని శాంతినగర్ హెచ్ డబ్ల్యూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం మాజీ ఎంపీటీసీ కొండూరి కిరణ్‌కుమార్ బెల్ట్‌లు, టై, బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రత్నమాధురి, టీచర్లు జి.సుధీర్, ఎస్ఎంసీ చైర్మన్ వీరస్వామి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థి కరిముల్లా కుటుంబానికి..

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 6వ తరగతి విద్యార్థి ఎస్‌కె కరీముల్లా కుటుంబాన్ని దాసరి వీరారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పరామర్శించి రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఘనంగా పోషణ్ మాసోత్సవం

చిన్నారులకు అన్నప్రాసన..



చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల రెబ్బవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం టీచర్ కె.రోహిణి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ జాజాన్‌బీ చేతుల మీదుగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్థానిక జెడ్పీ పాఠశాల నందు జిల్లా మహిళా ఇన్‌చార్జ్ చైర్మన్ షేక్ సమీన్ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మహిళా హెల్ప్‌లైన్ సఖీటీం మెంబర్ సుమలత, టీచర్లు కంచర్ల భాగ్యలక్ష్మి, రోహిణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

రుద్రాక్షపల్లిలో..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలలో భాగంగా బుధవారం తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, గంగారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శరారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అడవి మల్లెలలో..

పెనుబల్లి: మండలంలోని అడవి మల్లెలలో పోషకాహారంపై సీడీపీఓ నిర్మల జ్యోతి అవగాహన కల్పించి.. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమం ఏసీడీపీఓ మెహరున్నీషా,సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

విశ్వనాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో..

కల్లూరురూరల్: సీసీడీఎస్ చెన్నూరు సెక్టారు పరిధిలోని విశ్వనాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళలకు సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించి.. గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ రత్నమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రుపట్ల సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్ సులోచన, పంచాయతీ కార్యదర్శి, మహిళలు పాల్గొన్నారు.

మర్లపాడులో..



మర్లపాడులో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

వేంసూరు: మండలంలోని మర్లపాడులో అంగన్‌వాడీ కేంద్రంలో సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కనకదుర్గ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహనలు కల్పించి.. చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కమల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.